

ప్రొటోకాల్‌కు చట్టాలు లేవు
బోయకొండ గంగమ్మ ఆలయంలో ప్రొటోకాల్‌కు చట్టాలు, జీఓలు లేవని ఈఓ ఏకాంబరం పేర్కొన్నారు. - IIలో



పత్తా లేని సచివాలయ సిబ్బంది
పెద్దపంజాణి మండలం శంకర్‌రాయలపేట సచివాలయ సిబ్బంది విధులకు డుమ్మా కొట్టారు. - IIలో



బాల్యవివాహాల కట్టడికి చర్యలు
బాల్యవివాహాల కట్టడికి చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హైమావతి అధికారులకు సూచించారు. - IIలో

న్యూస్‌రీల్

బోయకొండ గంగమ్మకు నేడు పెద్దిరెడ్డి పట్టువస్త్రాల సమర్పణ

చౌడేపల్లె: శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబసమేతంగా ఉదయం 9:30 గంటలకు అమ్మవారి ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పట్టువస్త్రాలు అందజేసి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

హైరిస్క్ గర్భిణులకు మెరుగైన వైద్యం

చిత్తూరురూరల్ (కాణిపాకం): హైరిస్క్ గర్భిణులకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం వైద్యాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి, మాట్లాడారు. గర్భిణుల గుర్తింపులో నిర్లక్ష్యం వద్దన్నారు. గర్భం దాల్చిన రోజు నుంచి ప్రసవం అయ్యేంత వరకు కూడా మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. ప్రసవానికి సకాలంలో ఆస్పత్రికి చేర్చాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆమె పేర్కొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపు రేపు

చిత్తూరు కార్పొరేషన్: తపాలా వారోత్సవాల సందర్భంగా గురువారం ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఆ శాఖ సీనియర్ సూపరింటెండెంట్ లక్ష్మణ తెలిపారు. ఆధార్‌కార్డులో మార్పులు, ఫోన్ నంబర్ లింక్ చేసుకోవచ్చన్నారు. నూతన ఆధార్‌కార్డు నమోదును ఉచితంగా చేస్తారన్నారు. ఈ సేవలను చిత్తూరులోని ప్రధాన తపాలా కార్యాలయం, కలెక్టరేట్, లాలూగార్డెన్, నంగమంగళం, అరగొండ, మదనపల్లె, కుప్పం పోస్టాఫీసుల్లో ఈసేవలు పొందవచ్చన్నారు. వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

కోచింగ్ సెంటర్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు అర్హత కలిగిన ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌లు దరఖాస్తులు చేసుకోవచ్చని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన శిక్షణ సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే శిక్షణ సంస్థలు కనీసం గత రెండు డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లకు అభ్యర్థులకు కోచింగ్ ఇచ్చి ఉండాలన్నారు. గత డీఎస్సీ పరీక్షల్లో కనీసం 100 మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగం పొంది ఉండాలని తెలిపారు. 3 సంవత్సరాలు సరాసరి టర్నోవర్ కనీసం రూ.40 లక్షలు ఉండాలన్నారు. డీఎస్సీ శిక్షణ సంస్థలను ఎంప్యానెల్ చేయడానికి కావాల్సిన వివరాలు www. apeprourement. gov.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న కోచింగ్ సెంటర్‌ల నిర్వాహకులు ఈ నెల 21వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని కేజీబీవీ పాఠశాలల్లో బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ)ల్లో ఖాళీగా ఉన్న 15 బోధనేతర పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు అర్హత, ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోపు ఎంఈఓ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 2024 అక్టోబర్ 7 తేదీ నాటికి ఓసీ మహిళా అభ్యర్థులకు (42 సంవత్సరాల లోపు), ఎక్స్ సర్వీస్ మహిళా అభ్యర్థులకు 45 సంవత్సరాల లోపు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ మహిళా అభ్యర్థులకు 47 సంవత్సరాల లోపు, పీహెచ్‌సీ మహిళా అభ్యర్థులకు 52 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. నైట్ వాచ్‌మెన్, చౌకీదార్ పోస్టులకు ఏడో తరగతి ఉత్తీర్ణత, హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్, స్వీపర్, స్కావెంజర్‌లకు విద్యార్హత తప్పనిసరి కాదని తెలిపారు. ఈ పోస్టులు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 24 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 81,481 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 38,762 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 24 గంటల సమయం పడుతోంది.

గరుడ గమనం.. భక్తజన పునీతం!



గరుడ వాహనంపై మలయప్ప వైభవం

గరుడవాహనసేవలో భక్తజనం

మోహినీ అవతారంలో స్వామి, వెన్నముద్ద చేతపట్టిన చిన్నికృష్ణుడు

తిరుమలేశుడి బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన గరుడ వాహన సేవకు భక్తులు పోటెత్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం సాయంత్రం గరుడ వాహనాన్ని అధిరోహించి తిరుమాడ వీధుల్లో ఊరేగుతున్న దివ్యతేజోమూర్తిని దర్శించి పులకించిపోయారు. గోవింద నామస్మరణతో హారతులు పడుతూ.. భక్తులు తన్మయత్వం చెందారు. ఉదయం మోహినీ అవతారంలో వేంకటేశ్వరస్వామివారు భక్తకోటిని అనుగ్రహించారు.

అంగరంగ వైభవంగా శ్రీవారి గరుడ సేవ

- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఈఓ, అదనపు ఈఓ

తిరుమల: శ్రీవారు తనకిష్టమైన గరుడ వాహనాన్ని అధిరోహించి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. మంగళవారం రాత్రి 6.30 గంటలకే గరుడ వాహన సేవ ప్రారంభమైంది. ఉత్సవమూర్తిని ప్రతి భక్తుడూ దర్శించుకునేలా వాహనాన్ని అటూ ఇటూ తిప్పుతూ ముందుకు కదిలించారు. భక్తులు అధికంగా నిరీక్షించే ప్రాంతాల్లో హారతులతో కూడిన దర్శనం కల్పించారు. కూడళ్లలో ఎక్కువ సమయం వాహనాన్ని నిలిపి సాధ్యమైనంత ఎక్కువ మంది భక్తులకు దర్శనం కల్పించడంలో టీటీడీ ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్యచౌదరి, ఎస్పీ సుబ్బరాయుడు సఫలీకృతులయ్యారు. గ్యాలరీలు, బ్యారికేడ్ల నుంచి జనం స్వామిని దర్శించుకుని తన్మయత్వం పొందారు. ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

ఉదయం నుంచే నిరీక్షణ

గరుడ సేవను పురస్కరించుకుని మంగళవారం ఉదయం నుంచే భక్తుల రాక కనిపించింది. ఉదయం మోహినీ అవతారం ఊరేగింపులోనే నాలుగు మాడ వీధులు భక్తులతో కొంతమేర నిండాయి. వాహనం సేవ ముగిసిన తర్వాత సాయంత్రం 4 గంటలకే గ్యాలరీలన్నీ కిక్కిరిసిపోయాయి. ఆలయ వీధుల్లో 2 లక్షల మంది కూర్చుకునే అవకాశం ఉంది. కల్యాణకట్ట నుంచి అఖిలాండం మార్గంలోనూ, రాంభగీచా అతిథి గృహం నుంచి నాలుగు మాడ వీధుల్లోకి రాక పోకలు నిలిపి వేశారు. వాహనసేవ ప్రారంభమయ్యే వాహన మండపం సమీపానికి, భక్తులు కూర్చునే బ్యారికేడ్లలోకి ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసి అనుమతించారు. లగేజీతో భక్తులను అనుమతించలేదు.

భద్రత కట్టుదిట్టం



భక్తులను అదుపు చేస్తున్న భద్రతా సిబ్బంది

తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు స్వయంగా బందోబస్తును పర్యవేక్షించారు. ఈసారి మొత్తం 6,145 మంది పోలీసు సిబ్బంది నాలుగు మాడవీధులు, ట్రాఫిక్ మళ్లింపు ప్రాంతాల్లో మోహరించారు. ముందుజాగ్రత్త చర్యగా బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్‌లతో పాటు క్విక్ రియాక్షన్‌టీంలను రంగంలోకి దింపారు. వందలాది మంది పోలీసులు మఫ్టీలో నిఘా వేశారు. 10 పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్‌లో నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షిస్తూ నిఘాను పటిష్టం చేశారు. తిరుమల భద్రత కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆక్టోపస్ కమాండో సిబ్బంది కూడా అప్రమత్తం చేశారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుదాం!



సమావేశంలో మాట్లాడుతున్న చిత్తూరు, తిరుపతి జిల్లాల పార్టీ అధ్యక్షులు, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేద్దాం
- పార్టీలో కష్టపడే వారికి తగిన గుర్తింపు
- ఉమ్మడి చిత్తూరు జిల్లా నియోజకవర్గ నేతలతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి

తిరుపతి మంగళం: కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుదామని మాజీ మంత్రి, చిత్తూరు, తిరుపతి జిల్లాల పార్టీ అధ్యక్షులు, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి పీఎల్ఆర్ కన్వెన్షన్‌లో మంగళవారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీ, సమన్వయకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ ప్రజాసంక్షేమం, పేదల అభ్యున్నతి కోసం అవతరించిన పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. పేదల పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కంకణబద్ధులై శ్రమిద్దామన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీకి వెన్నుదండుగా ఉంటూ పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తున్న నాయకులకు, కార్యకర్తలకు వివిధ పదవులను ఇచ్చి తగిన గుర్తింపు కల్పిద్దామని చెప్పారు. పార్టీకి పట్టుగొమ్మలు కార్యకర్తలేనన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. అలాగే కూటమి ప్రభుత్వం చేపట్టే ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజలకు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయడం లేదన్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ అధికార దాహంతో నోటికొచ్చిన అబద్ధపు హామీలు ఇవ్వడం, అధికారంలోకి రావడం చంద్రబాబు నైజమని ఎద్దేవా చేశారు. ప్రజలకు అందిస్తామన్న సంక్షేమ పథకాలను చంద్రబాబు అమలు చేయకపోతే వైఎస్సార్‌సీపీ రోడ్లపైకి వచ్చి ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యేలు వెంకటేగౌడ్, డాక్టర్ సునీల్, నియోజకవర్గాల సమన్వయకర్తలు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, విజయానందరెడ్డి, రాజేష్, కృపారాణి పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తుల గడువు పెంపు

తిరుపతి ఎడ్యుకేషన్ : జాతీయ స్థాయిలో డిసెంబర్ 8వ తేదీన నిర్వహించనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీ వరకు గడువును పెంచినట్లు డీఈఓ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. ''డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓ వీ.ఇన్'' వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అన్ని యాజమాన్య ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ, వార్షికాదాయం రూ.3.5లక్షలలోపు ఉన్న వారు అర్హులన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష రుసుమును ఎస్‌బీఐ లింక్ ద్వారా చెల్లించాలన్నారు.

టెండరుదారులను తరిమేశారు

- నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణలు
- కనీస మర్యాదలు ఇవ్వలేదంటూ మాజీ చైర్మన్లు ఆగ్రహం



మాట్లాడుతున్న మాజీ చైర్మన్లు ఎస్‌కే రమణారెడ్డి, రతీదేవి

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద మూడు నెలలకు ముందు టెండర్‌దారులను దౌర్జన్యంగా తరిమేసి, రౌడీయిజం చేస్తున్నారని బోయకొండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు, టీడీపీ నాయకుడు ఎస్‌కే రమణారెడ్డి, రతీదేవిలు మంగళవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. బోయకొండ గంగమ్మకు కుటుంబసమేతంగా పట్టువస్త్రాలు సమర్పించడానికి బోయకొండకు వచ్చారు. మాజీ చైర్మన్లమైన తమకు ఈఓ ఏకాంబరం, కనీస మర్యాద ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకులే ఆలయం వద్ద టెండరుదారులను భయభ్రాంతులకు గురిచేసి రౌడీయిజంతో టెండర్లన్నీ లాక్కొని, అరాచకం చేస్తున్నారని ఆరోపించారు. టెండరు డబ్బులన్నీ దుర్వినియోగం అవుతున్నాయని, బోయకొండలో దౌర్జన్యపాలన సాగుతోందన్నారు. ఈఓ అండతో ఆలయంలో నిధులన్నీ దుర్వినియోగం చేస్తున్నారని, దసరా ఉత్సవాల పేరిట అధిక మొత్తంలో నిధులు ఖర్చు చేసినట్లు దోచుకోవడానికి పథకం వేశారని ఆరోపించారు. బోయకొండలో శాంతిని నెలకొల్పి, అక్రమాల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు మనోహర్, పురుషోత్తం, సోముశేఖర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆ.. బిడ్డయితే అంతమే!





▸▸ తమిళనాడు కాట్పాడికి చెందిన కుమారి (పేరుమార్చాం) తొలుత ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. రెండో సారి గర్భవతి అయినప్పుడు బంధువుల సాయంతో చిత్తూరులోని ఓ స్కానింగ్ సెంటర్‌ను ఆశ్రయించింది. అక్కడ మగ బిడ్డగా నిర్ధారణ చేసుకున్న ఆ మహిళ సంతోషంగా ఇంటికి తిరిగి వెళ్లింది. కొన్ని నెలల తర్వాత పురిటి నొప్పులు రావడంతో ప్రసవానికి తమిళనాడులోని ఓ ప్రభుత్వాస్పత్రిలో చేరింది. ప్రసవానికి ముందుగానే ఆమె తనకు పుట్టబోయేది మగబిడ్డ అని.. బిడ్డ పుట్టిన వెంటనే ఆపరేషన్ చేసేయమని అక్కడి డాక్టర్లు, సిబ్బందికి చెప్పింది. మగ బిడ్డే అని ఎలా చెబుతున్నావ్ అని డాక్టర్లు ప్రశ్నిస్తే, చిత్తూరులోని ఓ స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ చేసినట్లు వెల్లడించింది. ఇలాంటి ఘటనలపై తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి.

▸▸ తమిళనాడులోని వేలూరుకు చెందిన పొన్నిమగల్ (పేరు మార్చాం) అనే మహిళ రెండో కాన్పులో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తర్వాత గర్భవతి అని తెలుసుకున్న ఆ మహిళ కడుపులో ఉన్నది ఏ బిడ్డో తెలుసుకోవాలని నిర్ణయించుకుంది. తెలిసిన వారి సాయంతో చిత్తూరులోని ఓ స్కానింగ్ సెంటర్‌ను ఆశ్రయించింది. వారి సాయంతో ఆడో, మగో తెలుసుకుంది. లింగనిర్ధారణకు రూ. 5 వేలు ఇచ్చుకుంది. సెంటర్‌కు తీసుకెళ్లిన మహిళకు రూ.2వేలు ఇచ్చుకుంది. ఆడబిడ్డ అని తెలిసి అబార్షన్‌కు సిద్ధపడింది. ఇందుకుగాను రూ.8వేలు చెల్లించి కడుపులోనే పసిమొగ్గను తుంచేసినట్లు వైద్య బృందం పేర్కొంది.

- లింగనిర్ధారణకు తమిళనాడు నుంచి వస్తున్న గర్భిణులు
- గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్లు
- తమిళనాడు వైద్య ఆరోగ్యశాఖ అధికారుల నుంచి ఫిర్యాదులు
- డెకాయ్ ఆపరేషన్ చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు

కాణిపాకం (చిత్తూరు రూరల్): జిల్లాలో జిల్లాలో గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కొన్ని స్కానింగ్ సెంటర్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. యథేచ్ఛగా లింగ నిర్ధారణ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాయి. అయి తే ఈ దందా పక్క రాష్ట్రాలకు సైతం పాకింది. తమిళనాడు, కర్ణాటక నుంచి గర్భిణులు లింగనిర్ధారణతో పాటు అబార్షన్లకు జిల్లాలోని అనుమతిలేని స్కానింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ఇందులో ఆడబిడ్డయితే కడుపులోనే అంతం చేస్తున్నారు. దీనిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. జిల్లాలో మొత్తం 78 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. ఇందులో ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు 58, ప్రభుత్వానికి సంబంధించిన సెంటర్లు 20 దాకా నడుస్తున్నాయి. అనుమతి లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న సెంటర్లు జిల్లా వ్యాప్తంగా 35కు పైగా ఉన్నట్లు జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారుల పరిశీలనలో తేలింది. తనిఖీలు చేపట్టిన అధికారులు అనధికారిక సెంటర్లను గుర్తించి నోటీసులు జారీ చేశారు. ఈ సెంటర్లకు నిత్యం వందలాది మంది గర్భిణులు, మహిళలు వస్తుంటారు. ఇందులోని కొన్ని సెంటర్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి.



స్కానింగ్ సెంటర్ తనిఖీ(ఫైల్)

మహిళలు గర్భం దాల్చినప్పుడు పిండం ఎదుగుదల, గర్భసంచి పరిమాణం, వ్యాధు లు, సమస్యలు మాత్రమే చెప్పాలి. కానీ కొందరు లింగ నిర్ధారణ చేసేస్తున్నారు.

జననాల్లో ఆడపిల్లలే తక్కువ..

ఐదేళ్ల జననాల సంఖ్యను పరిశీలిస్తే ఆడపిల్లల సంఖ్య తక్కువగా ఉంటోంది. దీనికి కారణం భ్రూణ హత్యలే అనేది స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతి సంవత్సరం మగ పిల్లల కన్నా ఆడపిల్లల సంఖ్య తక్కువగా నమోదవుతోంది. ఈ ఏడాది జనవరి 1 నుంచి సెప్టెంబర్ వరకు 28,584 మంది జన్మిస్తే అందులో మగ పిల్లలు 15,212, ఆడ పిల్లలు 13,372 మందిగా తేలింది. అంటే 1,840 మంది తక్కువగా ఉన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తు తరాలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో కలెక్టర్ డెకాయ్ ఆపరేషన్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు 28 డెకాయ్ ఆపరేషన్‌లు చేశారు. అయితే అనుమతి లేని స్కానింగ్ సెంటర్లు, డెకాయ్ ఆపరేషన్ వివరాలను ఇంటి దొంగలే బయట పెడుతున్నట్లు అధికారుల దృష్టికి వెళ్లింది. తమిళనాడు నుంచి వస్తున్న ఫిర్యాదులపై మరింత పటిష్టంగా డెకాయ్ ఆపరేషన్ చేయాలని అధికారులు పూనుకున్నారు

జిల్లాలో స్కానింగ్ సెంటర్ వివరాలు

చిత్తూరు	పలమనేరు	కుప్పం	నగరి
37	22	14	5


జననాల వివరాలు

సంవత్సరం	పురుషులు	స్త్రీలు
2021–22	15,703	14,182
2022–23	15,061	14,186
2023–24	15,212	13,372

సరిహద్దు ప్రాంతాల్లోనే..

జిల్లాలో స్కానింగ్ సెంటర్లు నడుపుతున్న కొందరు తల్లి గర్భంలోనే మరణ శాసనం లిఖిస్తున్నారు. ప్రధానంగా చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పం తదితర ప్రాంతాల్లోని స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు ఆర్‌ఎంపీలు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యుల సహాయకులు స్కానింగ్ కేంద్రాలకు తీసుకెళ్లి పుట్టబోయే బిడ్డ లింగ నిర్ధారణ వివరాలు వెల్లడిస్తున్నారు. ఈ విషయం ఆ నోటా ఈనోటా పడి పక్క రాష్ట్రానికి కూడా పాకింది. తమిళనాడు, కర్ణాటక నుంచి వందల సంఖ్యలో గర్భిణులు లింగనిర్ధారణ కోసం జిల్లాలోని స్కానింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ఆడ అయితే శుక్రవారం, అమ్మవారి పేర్లు, అమ్మవారి చిత్రపటాలు చూపించడం, డాక్టరమ్మ, మైనస్, వంటి పదాలతో సూచిస్తున్నారు. మగబిడ్డ అయితే సోమవారం, ప్లస్, దేవుడి బొమ్మలు చూపి లింగనిర్ధారణ విషయాలను బయటపెడుతున్నారు.

ఫిర్యాదులు వస్తున్నాయి



జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న స్కానింగ్ సెంటర్లల్లో లింగనిర్ధారణ చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. తమిళనాడులోని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చిత్తూరు జిల్లాలో లింగనిర్ధారణ జరుగుతోందని కొన్ని వివరాలు ఇచ్చారు. వాటి ఆధారంగా ఆపరేషన్‌ను పకడ్బందీగా నిర్వహిస్తాం. పట్టుబడితే వారిపై కేసులు నమోదు చేస్తాం. అనుమతిలేకుండా నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్లకు ఇది వరకే నోటీసులు కూడా ఇచ్చాం. ఇప్పటి వరకు 28 డెకాయ్ ఆపరేషన్‌లు చేశాం.

–ప్రభావతిదేవి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

క్లుప్తంగా

మహిళలకు బ్యూటీ పార్లర్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో 15వ తేదీ (సోమవారం) నుంచి 30 రోజుల పాటు మహిళలకు బ్యూటీ పార్లర్‌పై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ పి.సురేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ మహిళలు అర్హులని తెలిపారు. కనీసం విద్యార్హత 10వ తరగతి చదువుకుని ఉండాలని సూచించారు. శిక్షణ సమయంలో సిబ్బందికి ఉచిత భోజనం, రానుపోను ఒక్కసారి చార్జీ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందిస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, నాలుగు పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి వారి పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11-48 ద్వారకా నగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి. ఫోన్: 79896 80587, 94949 51289, 83091 64644 సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- అయ్యప్పస్వామి ఇరుముడి చెల్లించడానికి వెళుతుండగా ఘటన



చికిత్స పొందుతున్న జయప్రకాష్

చౌడేపల్లె: చౌడేపల్లె- సోమల మార్గంలోని కడియాల కుంట సమీపంలో మంగళవారం బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. పెద్దయల్లకుంట్ల పంచాయతీ చెడుగుట్లపల్లెకు చెందిన జయప్రకాష్ అయ్యప్పమాల ధరించారు. అయ్యప్ప మాల ఇరుముడి చెల్లించడానికి సదుం యర్రాతివారిపల్లెలోని అయ్యప్ప స్వామి ఆలయానికి బైక్‌లో అతని చెల్లెలు స్వాతితో కలిసి బయలుదేరారు. కడియాలకుంట మలుపు వద్ద బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొంది. క్షతగాత్రులను 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స అనంతరం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మధ్యే మార్గం..!



కొత్త మద్యం దుకాణాలకు వేళయ్యింది. దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. మండలం యూనిట్‌గా ప్రకటనతో వ్యాపారులు సిండికేట్ కావడమే మార్గంగా కనిపిస్తోంది. ఇది కూటమి నేతలకు వరంగా మారింది. కూటమి నేతల కనుసన్నల్లోనే సిండికేట్ ఏర్పాటు కావడం తథ్యంగా కనిపిస్తోంది. సిండికేట్‌పై జిల్లాలోని అధికారపార్టీ నాయకుల నుంచి స్పష్టత రావడంతో ఒక్కసారిగా మద్యం దుకాణాలకు దరఖాస్తులు పోటెత్తాయి.

సిండికేట్ ఒకటే దారి

- ప్రైవేటు మద్యం దుకాణాల్లో యూనిట్ వివాదం
- మండలం ప్రామాణికంగా ఎక్కడైనా దుకాణం
- ఒకేచోట పక్కపక్కన పెట్టుకోవచ్చని పాలసీలో స్పష్టం
- పోటీ తట్టుకోవడానికి రేట్లు పెంచడమే తరువాయి
- నేటితో ముగియనున్న దరఖాస్తుల దాఖలు గడువు
- జిల్లాలో 1700 అప్లికేషన్లు వచ్చే అవకాశం

చిత్తూరు అర్బన్: నూతన మద్యం పాలసీలో ప్రభుత్వం పెట్టిన ఓ షరతు.. తప్పనిసరిగా సిండికేట్‌ను ప్రోత్సహించడం తప్ప మరో మార్గం లేదని స్పష్టమవుతోంది. అదే మండలం అంతా కలిపి ఒకే యూనిట్‌గా పేర్కొనడం. ఇలాగైతే వ్యాపారం చేయడం ఎలా సాధ్యం..? అనే ప్రశ్నకు ఎక్సైజ్ అధికారుల సమాధానం.. సిండికేట్..! మరోవైపు జిల్లాలో మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి బుధవారంతో గడువు ముగియనుంది.

ఎందుకు సిండికేట్..?

2017, 2015లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం విడుదల చేసిన మద్యం పాలసీల్లో మునిసిపాలిటీ పరిధిలో వార్డుల ఆధారంగా ఏ ప్రాంతంలో మద్యం దుకాణం పెట్టుకోవాలో సరిహద్దులు సూచించేవాళ్లు. మండలాల్లో అయితే గ్రామ పంచాయతీని సరిహద్దుగా తీసుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు లైసెన్సులు జారీ చేసేవాళ్లు. తాజాగా విడుదలైన పాలసీలో మునిసిపాలిటీ మొత్తాన్ని కలిపి ఓ యూనిట్, మండలాన్ని ఓ యూనిట్‌గా పరిగణించారు. అంటే చిత్తూరు కార్పొరేషన్‌లో 14 దుకాణాలకు లైసెన్సులు ఇవ్వనున్నారు. యూనిట్ ప్రామాణికంగా తీసుకున్నట్లయితే ఈ 14 దుకాణాలు నగరంలో ఎక్కడైనా పెట్టుకోవచ్చు. ఓ వ్యక్తికి దుకాణం వచ్చి మంచి సెంటర్‌లో వ్యాపారం బాగా జరుగుతోంది అనుకుందాం. మిగిలిన 13 మంది నగర పరిధిలో ఎక్కడెక్కడో దుకాణాలు పెట్టుకున్నా, వ్యాపారం జరగకపోతే, ఆ 13 మంది వచ్చి బాగా వ్యాపారం జరుగుతున్న దుకాణం పక్కనే మద్యం దుకాణాలు పెట్టుకోవచ్చు. అలాగే ఐరాల మండలంలో నాలుగు దుకాణాలకు లైసెన్సులు జారీ చేస్తే, కాణిపాకం కూడలిలోని దుకాణానికి మంచి డిమాండ్ ఉంది. అక్కడ ఒక్కటే దుకాణం పెట్టుకోవాలనే నిబంధన లేదు. నాలుగు అక్కడే పెట్టుకోవచ్చు. అన్ని దుకాణాలు ఒక్కచోటే ఉంటే, వ్యాపారం ఆశించిన స్థాయిలో జరగదు. దీనికి పరిష్కారం.. వ్యాపారులంతా కలిసికట్టుగా సిండికేట్ కావడం తప్ప మరో మార్గం లేదు. ఎమ్మార్పీ కంటే అధిక ధరకు మద్యం విక్రయించాలని, దుకాణాలు కూడా అన్నీ ఒకేచోట కాకుండా ఒక్కో దిక్కుకు ఒక్కొక్కటి పెట్టుకోవాలని సిండికేట్ నిర్ణయిస్తారు. ఈ విషయాన్ని బహిర్గతం చేయకనే, సిండికేట్‌ను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం మండల యూనిట్ అనే పదాన్ని పాలసీలో చేర్చినట్లు స్పష్టమవుతోంది.

అక్కడ సింగిల్ టెండర్లు..

మరోవైపు నగరి, నిండ్ర, సదుం, రొంపిచెర్ల మండలాల్లోని పలు దుకాణాలు ఎవరెవరు పాడుకోవాలో ఇప్పటికే నిర్ణయించేశారు. సిండికేట్ మాట జవదాటకుండా ఇక్కడ పలు దుకాణాలకు సింగిల్ టెండర్లు పడడం విశేషం. కాగా వచ్చిన దరఖాస్తులను ఈనెల 11వ తేదీన చిత్తూరు నగరంలోని షుగర్ ఫ్యాక్టరీ కల్యాణ మండపంలో లాటరీ పద్ధతిలో ఉదయం 8 గంటల నుంచి లైసెన్సుల కేటాయింపు జరగనుంది. దుకాణం వచ్చిన వాళ్లు లైసెన్సు ఫీజులో ఆరో వంతు నగదు అక్కడికక్కడే చెల్లించాల్సి ఉంటుంది.

భారీగా దరఖాస్తులు..

సిండికేట్లపై జిల్లాలోని అధికారపార్టీ నాయకుల నుంచి స్పష్టత రావడంతో ఒక్కసారిగా మద్యం దుకాణాలకు దరఖాస్తులు పోటెత్తాయి. చాలా చోట్ల దరఖాస్తులు ఎవరైనా వేసుకోండి, వ్యాపారం మేం చెప్పినట్లే జరగాలనే షరతు పెట్టినట్లు అర్థమవుతోంది. జిల్లాలోని 104 మద్యం దుకాణాలకు ఆదివారం వరకు కేవలం 287 దరఖాస్తులు వస్తే, సిండికేట్‌కు కూటమి నేతల సాకారం ఉందనే ప్రచారంతో సోమవారం రాత్రికి దరఖాస్తుల సంఖ్య ఒక్కసారిగా 767కు చేరుకుంది. ఇక మంగళవారం రాత్రికి ఈ సంఖ్య 1195కు చేరుకోవడం గమనార్హం. చివరి రోజైన బుధవారం ఈ సంఖ్య 1700 వరకు చేరుకునే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

కూటమి నేతలకు సుగమం

ప్రభుత్వం తీసుకొచ్చిన యూనిట్ అనే పదం మద్యం దుకాణాల్లో అధికారపార్టీ నాయకులకు రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలకడానికి మార్గం సుగమమైంది. కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే సిండికేట్ ఏర్పాటు కావడం తథ్యంగా కనిపిస్తోంది. అప్పుడే ఒక్కో లైసెన్సుదారుడు బాటిల్ మద్యాన్ని గరిష్ట చిల్లర ధర (ఎమ్మార్పీ)కు కాకుండా, అంతకన్నా ఎక్కువ మొత్తానికి విక్రయించి మద్యం ప్రియుల బలహీనతను సొమ్ము చేసుకోవచ్చు. వచ్చే లాభాల్లో ఎమ్మెల్యే వాటా..? ఎక్సైజ్ అధికారుల నెల మామూళ్లు..? దుకాణం వచ్చే పోలీస్ స్టేషన్‌కు నిర్వహణ ఖర్చులు..? ఇలా అన్నీ కూటమి నేతలే నిర్ణయించనున్నారు. చిత్తూరు, పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో ఈ వ్యవహారం ఇప్పటికే కొలిక్కి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. గంగాధరనెల్లూరు, నగరి, పూతలపట్టు నియోజకవర్గాల్లో మామూళ్ల పర్సంటేజీపై ఇంకా చర్చలు నడుస్తున్నట్లు తెలిసింది. దుకాణాలకు లాటరీ తీసేలోపు ఈ నియోజకవర్గాల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇక ఎవరిష్టం వచ్చిన ధరకు మద్యం విక్రయించడం, దోచుకోవడమే నూతన పాలసీలోని అసలు రహస్యం.

బాల్యవివాహాల కట్టడికి చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో బాల్యవివాహాల కట్టడికి ప్రత్యేక చర్యలు చేపడుతున్న ఐసీడీఎస్ పీడీ హైమావతి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో బాల్య వివాహాల కట్టడి అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ 31, 39 ఉత్తర్వులను అనుసరించి బాల్య వివాహాల కట్టడికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. బాల్య వివాహ నిరోధక అధికారుల అధికారాలు, విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. గ్రామ స్థాయిలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీసులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎవరైనా బాల్య వివాహాన్ని జరిపిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడకూడదని ప్రాజెక్టు డైరెక్టర్ తెలిపారు. చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలతో ఆరోగ్యపరంగా, మానసికంగా, శారీరకంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. కొన్ని సమయాల్లో తల్లీబిడ్డ ఇద్దరూ మరణించే ప్రమాదం ఉంటుందన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులకు, డ్రాపౌట్స్ పిల్లలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ విధానంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ చంద్రశేఖర్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుబ్రహ్మణ్యం, ప్రొటెక్షన్ అధికారులు శివశంకర్, రాధ రాణి, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరి నిందితుల అరెస్టు

ఏర్పేడు: హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు రేణిగుంట డీఎస్పీ వై.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఏర్పేడు పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రేణిగుంట మండలం, అత్తూరు పంచాయతీ పరిధి మొలగమూడి ఎస్సీ కాలనీకి చెందిన మొలగమూడి ప్రవీణ్(35) శుక్రవారం రాత్రి హత్యకు గురైనట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో ఏర్పేడు సీఐ జయచంద్రకు అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో రేణిగుంట మండలంలోని జీపాళెం క్రాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడిందన్నారు. మృతుడు మొలగమూడి ప్రవీణ్, మండలంలోని పెన్నగడం ఎస్సీ కాలనీకి చెందిన మొలగమూడి దినేష్ కుమార్ అలియాస్ దినేష్(20) కుటుంబాల మధ్య గత కొంత కాలంగా మనస్పర్థలున్నాయని తెలిపారు. దినేష్ రేణిగుంట మండలం, కుర్రకాల్వ ఎస్సీ కాలనీలోని స్నేహితుడు గుండూరు లోకేష్(20)తో ప్రవీణ్‌ను హతమార్చడానికి నిర్ణయించుకున్నాడని వెల్లడించారు. ఈ క్రమంలో లోకేష్, దినేష్, ప్రవీణ్ ఈ నెల 4న పాపానాయుడుపేటలో మద్యం సేవించారన్నారు. శుక్రవారం సాయంత్రం ముగ్గురూ కలిసి ద్విచక్ర వాహనంపై మండలంలోని రావిళ్లవారికండ్రిగ ఎరికలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలోని మామిడి తోటలోకి వెళ్లారని తెలిపారు. పథకం ప్రకారం తమవెంట తెచ్చుకున్న మచ్చు కత్తితో విచక్షణారహితంగా ప్రవీణ్‌పై ఇద్దరూ దాడి చేసి మెడ, గొంతు, ఛాతీపై నరికి హత్య చేశారన్నారు. ఆపై దినేష్, లోకేష్ అక్కడి నుంచి మృతుడి ద్విచక్ర వాహనంపై పారిపోయినట్లు చెప్పారు. ప్రవీణ్ హత్యకు ఉపయోగించిన మచ్చు కత్తి, సెల్ ఫోన్‌ను రహస్య ప్రదేశంలో ఉంచారన్నారు. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్టు చెప్పారు.

బొప్పాయిలో వింత



నగరంలోని గిరింపేట పగడమాను వీధిలో ఉన్న కోకిలమ్మ నివాసంలో పండిన బొప్పాయిలో వింత దృశ్యం దర్శన మిచ్చింది. బొప్పాయి పండులో కనిపించిన ఈ దృశ్యం చూసి స్థానికులు షాక్ అవుతున్నారు. ఆ బొప్పాయి లోపల పిండ ఆకారం ఉంది.

– చిత్తూరు కలెక్టరేట్

బోయకొండ ఆలయంలో ప్రొటోకాల్‌కు చట్టాలు లేవు

- ఎంపీకి ఈఓ రాసిన లేఖలో వివాదాస్పద అంశాలు
- ఈఓ చేష్టలపై మండిపడుతున్న భక్తులు



చౌడేపల్లె దసరా ఉత్సవాల ఆహ్వానపత్రిక

సాక్షి టాస్క్‌ఫోర్స్: ప్రశాంత వాతావరణంలో ఎత్తైన్న కొండలపై ఉన్న బోయకొండ గంగమ్మ ఆలయం జిల్లాలో రెండో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతోంది. ఇలాంటి పుణ్యక్షేత్రంలో ఆలయ ఈఓగా వచ్చిన ఏకాంబరం ఓవర్ యాక్షన్‌తో రోజుకొక వివాదం చెలరేగుతోంది. దీంతో భక్తులు ఏ నిమిషానికి ఏం జరుగుతుందోనని భయాందోళనలో నలిగిపోతున్నారు. తాజాగా దసరా ఉత్సవాల్లో ఆలయ ఈఓ ముద్రించిన కరపత్రాల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌లకు తగిన ప్రాముఖ్యత ఇవ్వకుండా చివరన వారి పేర్లు ముద్రించారు. ఎమ్మెల్సీ భరత్ ఫొటోను కూడ ముద్రించలేదు. కానీ ఎలాంటి అర్హత లేని తెలుగుదేశం నేత చల్లా రామచంద్రారెడ్డి ఫొటో ప్రముఖంగా ముద్రించడం, ఆయనతో అమ్మవారికి పట్టువస్త్రాలు ఇప్పించడంలో ఈఓ ఎన లేని ఉత్సాహం చూపారు. దీనిపై ఎంపీ మిథున్‌రెడ్డి హైకోర్టులో రిట్ దాఖలు చేశారు. హైకోర్టులో జరిగిన వాదనలో చల్లా రామచంద్రారెడ్డి వ్యక్తిగతంగా పట్టువస్త్రాలు సమర్పించినట్లు ఈఓ పేర్కొన్నారు. ఇలా ఉండగా ఎంపీ మిథున్‌రెడ్డి ఈ సంఘటనకు సంబంధించి వివరాలు తెలపాలని ఈఓకు లేఖ రాశారు. దీనిపై ఎంపీ ప్రివిలేజ్ కమిటీకి, ఎథిక్స్ కమిటీతో పాటు పార్లమెంటు స్పీకర్‌కు, దేవాదా యశాఖ ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి ఈఓ ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేశారు. ఇది ఇలా ఉండగా మంగళవారం ఈఓ ఏకాంబరం ఎంపీ లేఖపై స్పందిస్తూ ఎంపీ మిథున్ రెడ్డికి లేఖ రా శారు. అందులో చల్లా రామచంద్రారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించడం వ్యక్తిగతం అని పేర్కొన్నారు. అలాగే దేవాదాయశాఖలో ఎంపీ, ఎమ్మెల్యేలకు ప్రొటోకాల్ జీఓ కానీ, చట్టం కానీ లేదని పేర్కొన్నారు. కానీ ఎంపీ, ఎమ్మెల్యే ఫొటోలు చివరకు వే యకూడదని నిబంధనలు లేవన్నారు. తెలుగుదేశం ఇన్‌చార్జ్‌గా అధికార పార్టీకి చెందిన వ్యక్తికి తగిన గౌరవం ఇస్తూ చల్లా రామచంద్రారెడ్డి ఫొటోను ముద్రించడం తప్పుకాదన్నారు. ఈ విషయలన్నీ తాను నిబంధనల మేరకే చేశానని, ప్రొటోకాల్ ఉల్లంఘన జరగలేదని పేర్కొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అంతర్జాతీయ సదస్సు నేడు, రేపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మురకంబట్టులోని అపోలో యూనివర్సిటీలో బుధ, గురువారాల్లో నిర్వహించనున్న మానసిక ఆరోగ్యంపై అంతర్జాతీయ సదస్సును విజయవంతంతం చేయాలని ఆ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ వినోద్‌బట్ కోరారు. చిత్తూరు నగరం మురకంబట్టులోని అపోలో యూనివర్సిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బుధ, గురువారాల్లో జరగనున్న ఈ సదస్సులో మానసిక ఆరోగ్యంపై అంతర్జాతీయ నిపుణులు, వైద్యులతో చర్చించి తగిన వ్యూహాలను అన్వేషించనున్నట్లు తెలిపారు. సదస్సులో కెనడా, స్వీడన్ నేపాల్‌కు చెందిన డాక్టర్లు పాల్గొంటారన్నారు. వర్సిటీ అధ్యాపకులు పోతురాజు, భాస్కర్‌నాయుడు, హసీనా, సుధ, సుబ్రమణ్యం, విజయ్, కబీలన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తా లేని సచివాలయ సిబ్బంది



శంకర్‌రాయలపేట సచివాలయం ముందు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని తీసుకొచ్చి గ్రామీణులకు సత్వర న్యాయం జరగాలనే తలంపుతో గత ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రారంభించింది. కానీ ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన సచివాలయాల ఉద్యోగులు విధులకు వెళ్లకుండా ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చుతున్నారు. పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలం శంకర్‌రాయలపేట(మాడీ) సచివాలయాన్ని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కానీ అక్కడి కార్యాలయంలో ఒక్క సిబ్బంది కూడా లేరు. కనీసం గంటకు పైగా ఆయన కార్యాలయంలో ఉన్నా ఏ ఒక్కరూ కనిపించలేదు. దీంతో ఆగ్రహించిన ఆయన ఆ మండల అధికారులతో మాట్లాడినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇదేమిటని అక్కడున్న గ్రామస్తులను విచారించగా సచివాలయ సిబ్బంది అసలు కార్యాలయానికి రావడమే లేదని పొద్దున వచ్చి ప్రెజెంట్ వేసుకున్న అనంతరం ఇళ్లకు వెళ్లిపోతుంటారని తెలిపారు. దీనిపై మరింత ఆగ్రహించిన ఆయన జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇలాంటి వారు ప్రజలకు ఏమి సేవలందిస్తారని, వీరిపై తగు చర్యలు తీసుకోవాలంటూ సూచించారు. బోర్లా తెరిచిన సచివాలయంలో కంప్యూటర్లు, ప్రింటర్, లేదా ముఖ్యమైన పత్రాలను ఎవరైనా తీసుకెళ్లినా అడిగే దిక్కెవరంటూ ప్రశ్నించారు. దీనిపై తాము వదిలిపెట్టే ప్రసక్తే లేదని, సచివాలయ సిబ్బందిపై వేటు తప్పదని హెచ్చరించారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న సచివాలయ సిబ్బంది సైతం జెడ్పీ చైర్మన్ తనిఖీ చేస్తున్నారని చెప్పినా ఎవరూ వెళ్లకుండా కనీసం ఖాతరు చేయకపోవడం కొసమెరుపు. ఇలాంటి వారు ప్రజలకు ఏం సేవలందిస్తారంటూ జనం దుమ్మెత్తిపోస్తున్నారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు

- రెవెన్యూ, పోలీస్‌లను అడ్డుకున్న కూటమి నేతలు



కూటమి నేతల ఆక్రమణలో కంచె వేసిన గ్రామకంఠం భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ, పోలీస్

భాకరాపేట: మండలంలోని తిప్పిరెడ్డి గారిపల్లె పంచాయతీ, కమ్మపల్లె గ్రామం వద్ద ఉన్న గ్రామ కంఠం భూమి ఆక్రమించి కంచె వేశారని కూటమి నేతలు సోమవారం ప్రజావేదికలో ఫిర్యాదు చేశారు. మంగళవారం మధ్యాహ్నం రెవెన్యూ, పోలీసు అధికారులు గ్రామ కంఠం భూమిని పరిశీలించారు. తిప్పిరెడ్డి గారిపల్లె రెవెన్యూ గ్రామం, కమ్మపల్లె గ్రామానికి ఆనుకొని ఉన్న సర్వే నం.76లో పూరా విస్తీర్ణం 1.56 సెంట్లు ఉంది. అందులో ఇదే పంచాయతీ, యడమవారిపల్లెలో జాతీయ ర హదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి ఇండ్లు ఇచ్చేందుకు గత ప్రభుత్వంలో కమ్మపల్లె గ్రామకంఠం భూమిలో 24 ప్లాట్లు వేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అది ఆగిపోయింది. ఇండ్ల ప్లాట్లు వేసిన భూమి పోను మిగిలిన భూమిని కూటమి నేతలు ఆక్రమించి కంచె వేశారు. ఈ విషయంగా మరో వర్గం కూటమి నేతలు ఫిర్యాదు చేశారు. పోలీసుల సహకారంతో రెవెన్యూ అధికారులు కంచె తీసివేయడానికి ప్రయత్నించగా ఆక్రమణదారులు అడ్డుకున్నారు. ఎన్నో ఏళ్లుగా తమ అనుభవంలో ఉండే భూమికే కంచె వేసుకున్నామని చెప్పారు. దీంతో రికార్డులు ఉంటే చూపించాలని అధికారులు కోరారు. గ్రామ కంఠం భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి, ఇళ్లులేని పేదలకు ఇంటి స్థలాలను ఇవ్వాలని కూటమి నేతలు కోరారు. ఆక్రమణకు పాల్పడ్డ గ్రామస్తులు ఎమ్మెల్యే నాని ద్వారా చెప్పిస్తాం.. అప్పటి వరకు కంచె తొలగించొద్దని చెప్పడంతో రెవెన్యూ, పోలీసు అధికారులు వెనుదిరిగారు. ఆర్‌ఐ శ్రీనివాసులు, ఏఎస్‌ఐ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షిస్తాం

ప్రభుత్వ భూముల్లోకి ఎవరు ప్రవేశించినా కఠిన చర్యలు తప్పవు. కమ్మపల్లె గ్రామ కంఠం భూమిని స్వాధీనం చేసుకుంటాం.

– జనార్దనరాజు, తహసీల్దార్, చిన్నగొట్టిగల్లు

మీ ఎమ్మెల్యేలకే ఇచ్చేయండి

- టెండర్లు పెట్టి బెదిరించడం ఎందుకు..?
- మద్యం షాపుల టెండర్లపై మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆగ్రహం



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: 'మద్యం షాపుల టెండర్లలో గోల్‌మాల్ జరుగుతోంది.. కూటమికి చెందిన వారే సిండికేట్‌గా ఏర్పడి షాపులను దక్కించుకునేందుకు కుటిల యత్నాలకు బీజం వేస్తున్నారు. ఈ తతంగం అంతా ఎందుకు..మీ ఎమ్మెల్యేకే ఇచ్చేయండి.' అని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మండిపడ్డారు. మంగళవారం వెదురుకుప్పంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మద్యం షాపులు నడిపేందుకు కూటమి ప్రభుత్వం టెండర్లకు అవకాశం ఇస్తే ఎవరైనా దరఖాస్తు వేసుకోవచ్చన్న ఇంకిత జ్ఞానం కూడా లేకుండా కూటమి ఎమ్మెల్యేలు బెదిరింపులకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు. మద్యం షాపులు తమకే దక్కాలి.. తద్వారా రూ.కోట్లు కూడబెట్టుకోవాలన్నా దురాలోచనతో మద్యం షాపులకు టెండర్లు వేసే వాళ్లపై దౌర్జన్యాలకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్న ఘటనలను సాక్షాత్తూ చంద్రబాబుకు ఊదరగొట్టే మీడియానే ఖండిస్తున్నా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం రాలేదన్నారు. టెండర్ల విధానాన్ని పక్కన పెట్టి నామినేషన్ పద్ధతిలో మీ ఎమ్మెల్యేలకే మద్యం షాపులను అప్పగించేందుకు సీఎం చంద్రబాబు ఏదో జీఓ తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ జరగని రీతిలో మద్యం షాపులను దక్కించుకునేందుకు కూటమి ఎమ్మెల్యేలు చేస్తున్న అఘాయిత్యాలు మామూలుగా లేవన్నారు. గ్రామాల్లో చోటా నాయకుల దగ్గర నుంచి ఎమ్మెల్యేల వరకు నేరుగా ఫోన్లు చేసి వైఎస్సార్‌సీపీ నాయకులను టెండర్లు వేయకుండా అడ్డుకుంటున్నారని చెప్పారు. అలా వేస్తే నీ అంతు చూస్తానంటూ హెచ్చరిస్తున్నారని పేర్కొన్నారు. కేవలం కూటమి ఎమ్మెల్యేలకు ప్రయోజనం చేకూర్చాలన్న ఆలోచనతో దుకాణాలను ప్రైవేట్ పరం చేసినట్లు చెప్పారు. బీసీల ముఖ్యమంత్రిగా చెప్పుకునే చంద్రబాబు మద్యం దుకాణాలకు కూడా రిజర్వేషన్లు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలలకే అవినీతి అక్రమాల్లో కూరుకుపోయిందని ఆరోపించారు. ప్రజలు ఎంతో ఆశించినా ఏ ఒక్కటికీ నెరవేర్చకుండా మోసం చేస్తున్న వైనాన్ని గమనిస్తున్నట్లు చెప్పారు. అదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉంటే ఇప్పటికే సంక్షేమ పథకాలు అందేవని తెలిపారు. నాణ్యమైన మద్యం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే నన్నారు. ప్రజలు బాగుపడాలన్న ఉద్దేశం ఉంటే నాణ్యమైన ఉచిత విద్య, మెరుగైన వైద్యం అందుబాటులోకి తెస్తామంటారే గానీ, ఇలాంటి నీచమైన ఆలోచన చేసి సీఎం కావడం ఆశ్చర్యకరమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు రామయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, యువత అధ్యక్షుడు గణపతిరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, బొమ్మయ్యపల్లె సర్పంచ్ చొక్కా గోవిందయ్య, స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలార్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.